ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 21: ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన వారంతా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కూకట్‌పల్లి ఏఈఆర్‌వో, డీసీ రమేశ్ అన్నారు. ఆదివారం ఓటరు నమోదు కోసం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూకట్‌పల్లి నియోజకవర్గం ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించడం జరిగిందన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి అర్హులైన వారికి ఓటరు జాబితాలో పేరును చేర్చడం జరుగుతుందన్నారు. తప్పు ఒప్పులను సరిచేసి తుది జాబితాను విడుదల చేస్తామన్నారు.

బబ్బుగూడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు

అల్లాపూర్, జనవరి 21: మోతీనగర్ పరిధి బబ్బుగూడ ఈస్ట్ సంక్షేమ సంఘానికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో సమీప అభ్యర్థి మీజిత్‌ఖాన్‌పై 60 ఓట్ల మెజార్టీతో అధ్యక్షుడిగా బోడా వెంకటేశ్వర్‌రావు(సీను) ఘనవిజయం సాధించాడు. ఈ మేరకు ఎన్నికల అధికారి చాంద్‌పాషా వెంకటేశ్వర్‌రావుకు నియామకపత్రాన్ని అందజేశారు. మొత్తం 254 ఓట్లు ఉండగా, ముగ్గురు అభ్యర్థులు సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి పోటీపడ్డారు.

బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ అందిస్తాం

- కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మల్కాజిగిరి పార్లమెంటరీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 21 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీని అందిస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు ఆధ్వర్యంలో జరిగిన మల్కాజిగిరి పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో పాటు కార్పొరేటర్లు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో గత పదేండ్ల కాలంగా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించానని.. కాలనీలు, బస్తీల్లో ప్రజలతో మమేకం కావడం వల్లే మూడోసారి ఎమ్మెల్యేగా ఆదరించారని తెలిపారు. ఈ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజల మద్దతుతో 72 వేల మెజార్టీతో విజయం సాధించానని, వారికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఇదే తరహాలో పనిచేసి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడంతో పాటు బీఆర్ఎస్ పార్టీని తిరుగులేని శక్తిగా మార్చుతానన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీని అందిస్తామని హామీనిచ్చారు. ఈ వేదికపై భారీ మెజార్టీతో విజయం సాధించిన మాధవరం కృష్ణారావును వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాస్‌రావు, శిరీషాబాబూరావు, సబీహా బేగం, సతీశ్‌గౌడ్, నర్సింహయాదవ్, రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, కో ఆర్డినేటర్ సతీశ్ అరోరా, మాజీ కార్పొరేటర్లు బాబూరావు, శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..

కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం బాలాజీనగర్ డివిజన్‌లోని పుల్లూరు నారాయణదాసు కల్యాణ మండపంలో జరిగిన తెలిదేవర వెంకట్రావ్ నగర్ (టీవీఆర్‌నగర్) స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష, మాజీ కార్పొరేటర్ బాబూరావు పాల్గొన్నారు. 50 ఏండ్ల కిందట ఏర్పడిన టీవీఆర్‌నగర్‌లో ప్రజా సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని, టీవీఆర్‌నగర్ ప్రజలకు స్వర్ణోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, ప్రజలు ఉన్నారు.

హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీని అభినందించిన కేటీఆర్

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా గత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా సేవలందిస్తూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అభినందించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన మల్కాజిగిరి పార్లమెంటరీ ముఖ్యనాయకుల సమావేశంలో ఎమ్మెల్యే కేపీని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. – కుత్బుల్లాపూర్, జనవరి 21

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ గాంధీనగర్‌లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని తక్షణమే సరి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ కోరారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి వైర్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు. – మియాపూర్, జనవరి 21

తల్లిదండ్రులే మనకు రోల్ మోడల్

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, జనవరి 21: మనకు బంగారు భవిష్యత్‌ను అందించిన తల్లిదండ్రులను ఎప్పుడు మరువరాదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం నగరంలోని నెక్లెస్ రోడ్డులో ఎల్డర్లీ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో సుమారు 50 నుంచి 70 కుటుంబాల్లో పిల్లలు, పెద్దలు అంతా కలిసి సరదాగా గడిపేందుకు నెక్లెస్ రోడ్డు నుంచి గండిపేట్ వరకు నిర్వహించిన సెకండ్ ఇన్నింగ్స్ ఫ్యామిలీ ర్యాలీని ఎమ్మెల్యే కేపీ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం రాత్రీ పగలు తేడా లేకుండా అహర్నిశలు పని చేసి మన ఉజ్వల భవిష్యత్‌తో మన ఆనందంలో తమ ఆనందాన్ని వెతుక్కుంటూ జీవించే తల్లిదండ్రులను ఎన్నటికి మరువవద్దని, మన తల్లిదండ్రులే మనకు రోల్ మోడల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డర్లీ కేర్ సెంటర్ నిర్వాహకులు మాధురి, గణేశ్ ఆకెళ్ల, పెద్దలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

'సెకండ్ ఇన్నింగ్స్ ఫ్యామిలీ' ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

శ్రీరాంప్రసాద్ దూబే కాలనీ కమిటీ ఎన్నిక

శేరిలింగంపల్లి, జనవరి 21 : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని శ్రీరాంప్రసాద్ దూబే కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా కె.అనిల్‌కుమార్ ముదిరాజ్, అధ్యక్షుడిగా చిట్టారెడ్డి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి, ఉపాధ్యక్షుడిగా రాయల ప్రవీణ్‌కుమార్, మల్లిఖార్జునచారి, పిల్లి యాదగిరి, బ్రహ్మానందంలను ఎన్నుకున్నారు. తమపై నమ్మకంతో అసోసియేషన్ వెల్ఫేర్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్న కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, రాజీవ్ గృహకల్ప సముదాయంలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 'భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూపు'(బీబీజీ) ప్రతినిధులు మైక్‌సెట్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీబీజీ కార్యవర్గ సభ్యులు లక్ష్మణరావు, లక్ష్మణ్‌కుమార్, జయబాబు, తులసీ కృష్ణమూర్తి, విద్యాసాగర్, మరుతీరాం, సుధాకర్, మహిళా విభాగ్ సభ్యురాలు సుగుణ, పాల్గొన్నారు. – దుండిగల్, జనవరి 21

సమస్యలు పరిష్కరించాలని వినతులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు ఆదివారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. – దుండిగల్, జనవరి 21

మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం పలువురు కళాకారుల గాత్ర, నృత్య ప్రదర్శనలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు, సౌకర్యాలను కల్పించినట్లు శిల్పారామం నిర్వాహకులు తెలిపారు. – కొండాపూర్, జనవరి 21

కూకట్‌పల్లిలో భారీ బైక్ ర్యాలీ

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 21 : అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలను పురస్కరించుకుని కూకట్‌పల్లిలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర సంచాలన సమితి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. కూకట్‌పల్లిలో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీనగర్, పాపారాముడునగర్, ప్రశాంత్‌నగర్, దీన్‌దయాల్ కాలనీ, జయానగర్, వివేకనందనగర్, భాగ్యనగర్ కాలనీల్లో కొనసాగింది. ఈ ర్యాలీలో రామ భక్తులు, హిందూ బంధువులు భారీగా పాల్గొని కాషాయం జెండాలను చేతపట్టుకుని జైశ్రీరామ్ నినాదాలతో కూకట్‌పల్లి మార్మోగింది. కార్యక్రమంలో సీహెచ్.కొండల్‌రావు, అనిల్, వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, పన్నాల హరీశ్‌రెడ్డి, మాధవరం కాంతారావు తదితరులు ఉన్నారు.

బైక్ ర్యాలీలో రామ భక్తులు

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 21 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 17, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 45, కాకరకాయ 38, బీరకాయ 50, క్యాబేజి 19, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 23, కాలీఫ్లవర్ 23, దొండ 23, చిక్కుడు 35, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలుగడ్డ 23, కీరా 18, దోసకాయ 23, సొరకాయ 9, పొట్లకాయ (1) 15, కందగడ్డ 55, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 22, చింతకాయ 40, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 67, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 28, గుమ్మడికాయ 23, నిమ్మకాయలు(12) 32 నుంచి 36, మునగకాయ (1) 10 నుంచి 12, పచ్చి బఠాని 40, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 280, అల్లం 140, వెల్లుల్లి 280, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

కేపీహెచ్‌బీ కాలనీ/మియాపూర్, జనవరి 21: కాలనీలు, బస్తీల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపారాయుడునగర్, అన్బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్, ప్రగతినగర్, హనుమాన్‌నగర్, దీనబంధు కాలనీ, తులసీవనం గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు ఆయన పర్యటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, స్థానిక నేతలున్నారు. అలాగే కూకట్‌పల్లి, మియాపూర్ డివిజన్‌ల పరిధిలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ ఆదివారం పర్యటించారు. పలు కాలనీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలోని ఛత్రపతి శివాజీ యువసేన, లక్ష సాధన ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో గడప గడపకు 'గోవు-గోవిందుడు-గీత' అనే నినాదంతో ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ నుంచి తిరుమల తిరుపతికి దేవస్థానానికి చేపట్టిన మహాపాదయాత్రను శక్తివాహిని ఫౌండర్ మౌనిక, డాక్టర్ రామ్ సింగ్ ప్రారంభించారు. ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు, మహాపాదయాత్ర రూపకల్పి యోగేశ్‌ప్రభు, అచ్యుతరావు, ప్రభాకర్ తదితరులున్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 21

మెరుగైన వేతన ఒప్పందానికి కృషి

జీడిమెట్ల, జనవరి 21: కార్మికుల హక్కులను కాపాడేందుకు ఐఎన్‌టీయూసీ పోరాటాలు కొనసాగిస్తుందని ఆ సంస్థ రాష్ట్ర నాయకుడు చింతల నాగరాజు అన్నారు. ఆదివారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని థర్మో కేబుల్ కంపెనీలో ఆయన ఐఎన్‌టీయూసీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి అని, ఏప్రిల్ నెలలో జరిగే థర్మో కేబుల్ పరిశ్రమ అగ్రిమెంట్‌లో కార్మిక శాఖమంత్రి సహకారంతో మెరుగైన వేతన ఒప్పందం జరిగేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు శ్రీనివాస్, దేవా, ఆనంద్, థర్మో కేబుల్ కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

జీడిమెట్ల, జనవరి 21: చూపులేని వారికి లూయిస్‌బ్రెయిలీ లిపీ ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపారని సీడీపీవో హెస్పిబా అన్నారు. ఆదివారం సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ తెలంగాణ శాఖ, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంయుక్త ఆధ్వర్యంలో బ్రెయిలీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ అధ్యక్షుడు వీర రాఘవ, బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియషన్ అధ్యక్షుడు మల్లేశం తదితరులు హాజరై కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజావల్యూ ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ ఎండీ షరీఫ్, నేషనల్ ఫెడరేషన ఆఫ్ ది బ్లైండ్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మాదాపూర్, జనవరి 21: వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆదివారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన నందకిశోర్(30) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లోని మాదాపూర్‌కు వచ్చి సోదరుడి ఇంట్లో నివాసం ఉంటూ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 14వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి సోదరుడు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతరకు పోటెత్తిన జన సందోహం

వైభవంగా చిత్తారమ్మ జాతర

- పోటెత్తిన భక్తజన సందోహం
- ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

దుండిగల్, జనవరి 21: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజల ఆరాధ్యదైవం, కొలిచేటి భక్తుల కొంగుబంగారం, గాజులరామారం ప్రజల ఇలవేల్పు చిత్తారమ్మదేవి జాతర(బ్రహ్మోత్సవాలు) ఆదివారం వైభవంగా జరిగాయి. నగరం, శివారు ప్రాంతాలతోపాటు నగరం చుట్టూ ఉన్న జిల్లాలకు చెందిన లక్షలాది మంది భక్తులు వేడుకలకు హాజరుకావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జనసంద్రాన్ని తలపించింది. ఉత్సవాలకు ఆదివారం ఒక్క రోజే సుమారు రెండున్నర లక్షల మంది భక్తులు హాజరై ఉంటారని తెలుస్తున్నది. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తుల తాకిడితో ఆలయ ప్రాంగణం డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలు, పోతరాజుల వీరంగాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామున 3 గంటలకు వేదపండితుల మంత్రోశ్చారణలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. విజయదర్శనం అనంతరం తలంబ్రాలు(ఒడిబియ్యం) సమర్పించిన అనంతరం అమ్మవారు భక్తులకు నిజదర్శనం ఇచ్చారు. సాయంత్రం పలహార బండి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. కాగా, జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాలానగర్ జోన్ ఏసీపీ గంగారాం ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి వైపు నుంచి వచ్చే వాహనాలను, షాపూర్‌నగర్ చౌరస్తా వైపు నుంచి వచ్చే వాహనాలను పోలీసులు దారి మళ్లించారు.

ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు

చిత్తారమ్మదేవి జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ దంపతులు, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, బాలానగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్, గాజులరామారం, సూరారం డివిజన్‌ల కార్పొరేటర్లు రావులశేష గిరిరావు, మంత్రి సత్యనారాయణ తదితరులు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, సభ్యులు అముర ఇంద్రసేనా గుప్త, ఆర్.బాలరాజు, ఎం.పెంటారెడ్డి, జీ. నర్సింహ, ఆర్.నర్సింహ, ఆర్.సత్తయ్య, డీ. ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాలతో వస్తున్న మహిళలు

ఆలయప్రాంగణంలో భక్తుల సందడి

ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

జాతరలో శివసత్తుల సందడి, బోనాలతో వస్తున్న భక్తులు

సంఘ భవనానికి సాయం

నకిరేకల్ మండలం నోముల గ్రామంలో నిర్మిస్తున్న గౌడ సంఘం భవనానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, ఉద్యమ నాయకుడు మాచర్ల భద్రయ్య రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు సంఘ ప్రతినిధులకు ఈ మొత్తాన్ని వివేకానందనగర్‌లోని తన నివాసంలో అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు జంగయ్య, వెంకటేశ్వర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. – మియాపూర్, జనవరి 21

అక్షింతలు పంపిణీ

శేరిలింగంపల్లి, జనవరి 21: అయోధ్య రామజన్మ భూమిలో సోమవారం జరగనున్న బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి అందజేస్తున్న అక్షింతలను ఆదివారం లక్ష్మీవిహార్ కాలనీలో కమిటీ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్ దూబే ఆధ్వర్యంలో పల్లకిలో సీతారాముల ప్రతిమలతో రామ భజన చేస్తూ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

కుత్బుల్లాపూర్, జనవరి 21: కుత్బుల్లాపూర్ భాగ్యలక్ష్మి కాలనీ నేతాజీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా సామాజిక, సాంస్కృతిక, సాహిత్య సేవా సంస్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎంఆర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ స్టేట్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చింతల మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గోగులపాటి కృష్ణమోహన్, నేతాజీ హైస్కూల్ కరస్పాండెంట్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.